క్లుప్తంగా

సమర్థవంతంగా పనులు చేయాలి

సబ్బవరం: ఉపాధి హామీ పథకం క్షేత్ర సిబ్బంది సమర్థవంతంగా పనులు చేయాలని ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ మణికుమార్‌తో కలిసి ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ప్రతిరోజు 6 నుండి 9 వేల మంది ఉపాధి కూలీల హాజరు కావాలన్నారు. రాష్ట్రానికి ఉపాధి పనులు చేపట్టేందుకు రూ.15 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో సేవా కార్యక్రమం

కంచరపాలెం: అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పేద మహిళలకు చీరలు అందజేసి, అన్నదానం చేశారు. ముందుగా బుద్ధుని విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు జరిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో అందరికీ ఆరోగ్య రక్ష

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- గొరపల్లిలో వేడుకగా ప్రారంభమైన కార్యక్రమం



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మందులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు

సింహాచలం : రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెందుర్తి మండలంలోని గొరపల్లిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను, 104 నూతన వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోవాలని, ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలన్నదే ఆయన ఉద్దేశ్యమన్నారు. వ్యవసాయ రంగం దినదినాభివృద్ధి చెందాలన్నదే ఆయన ఆకాంక్ష అన్నారు. దీనిలో భాగంగా విద్యార్థుల చదువుకు అమ్మఒడి పేరిట సాయమందిస్తున్నారని అన్నారు. నాడు-నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. రైతులకు, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి ఆరోగ్య బాధ్యతలు తీసుకుని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారని తెలియజేశారు. వెల్నెస్ సెంటర్‌లో అన్ని ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజలకు కావాల్సిన మందులు అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రజలందరికీ 24 గంటలు అందుబాటులో 104 వాహనం ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ఒక ఫ్యామిలీ డాక్టర్ ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మందులు అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గొరపల్లి సర్పంచ్ శ్రీను, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, వైద్యాధికారులు డాక్టర్ పూర్ణేశ్‌బాబు, జీవనారాణి, జగదీష్‌ప్రసాద్, పద్మావతి పాల్గొన్నారు.

పరవాడ, వాడచీపురుపల్లిలో..

పరవాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ వైద్య విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావాలని పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీల సంయుక్త ఆధ్వర్యంలో వెన్నెలపాలెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కుటుంబ డాక్టర్ విధాన శిబిరాన్ని ఎంపీపీ వెంకట పద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజులు ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటి వద్దే వైద్య సేవలు అందే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల వైద్యులు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి వైద్య సేవలు అందిస్తారన్నారు. ఒక గ్రామాన్ని నెలలో రెండు పర్యాయాలు సందర్శించి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 14 రకాల టెస్టులు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచుతారన్నారు. మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేస్తారని ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, ఎంపీటీసీ అరుణకుమారి, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.ఆర్.రంజిత్, ఈవోఆర్డీ పద్మజ, వెన్నెలపాలెం, పరవాడ ఉప సర్పంచ్‌లు వెన్నెల సన్యాసిరావు, బండారు రామారావు, నాయకులు చల్లా కనకారావు, పైల సత్యనారాయణ (బొబ్బిలి), వి.సింహాద్రి, రెడ్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని సేవలు చేసేందుకే

- జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం
- పార్టీ శ్రేణుల సమావేశంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు

సింహాచలం : ఈనెల 7 నుంచి జరిగే 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని 95వ వార్డులో విజయవంతంగా నిర్వహించాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు పిలుపునిచ్చారు. వార్డు పరిధిలోని ఆర్.కె.ఫంక్షన్ హాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్తు.. మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అర్హులకు అందించి, వారి అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందేలా చేశారన్నారు. ఎలాంటి అవినీతికి, లంచానికి తావు లేకుండా చేశారన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ అందించని సంక్షేమ ఫలాలను ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా, జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేవని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని విజయకేతనం ఎగురవేస్తారన్నారు. వార్డులో జగనన్నే మా భవిష్యత్తు.. కార్యక్రమం ద్వారా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి గడపకూ వెళతారన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, వారి అభిప్రాయాలు తెలుసుకుని, వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.

అప్పన్నకు నృత్య నీరాజనం



కళాకారిణులకు బహుమతులు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. నగరంలోని స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కి చెందిన కళాకారులు తమ నృత్య ప్రదర్శనతో స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై కళాకారిణి అక్షయ చేసిన ఒడిస్సీ నృత్యం, వైష్ణవి చేసిన సాంప్రదాయ శాస్త్రీయ నృత్యం విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే కళాకారిణి టీనా చేసిన కథక్, సంఘవి, లక్ష్మి స్నేహితల మణిపురి శాస్త్రీయ సంగీత ప్రదర్శన అలరించాయి. కేరళ సంప్రదాయ మోహిని నృత్య ప్రదర్శనను కళాకారిణి పూజిత చందన చేసి అబ్బురపరిచారు. అలాగే కమలాసిని, జోషిత, సహస్ర, గీతిక అస్సాం సాంప్రదాయ జానపద నృత్యాలతో అలరించారు. జనిత్ సంఘవి, నిత్య అనన్య చేసిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని కళాకారిణులను అభినందించి బహుమతులు అందజేశారు. కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్‌ను సత్కరించారు. దేవస్థానం ఉద్యోగి దొంతల రమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా ముత్యమాంబ అమ్మవారి పండగ



ముత్యమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు



జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత అనకాపల్లి జట్టు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని చినగొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం శ్రీ ముత్యమాంబ అమ్మవారి పండగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా గురువారం వేకువజాము నుండి అమ్మవారికి ప్రత్యాక పూజలు, అభిషేకాలు జరిగాయి. మహిళలు పసుపు కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు అమ్మవారిని దర్శించుకున్న వారిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, ఎంపీటీసీ బి. దేముడుబాబు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, బోను గంగునాయుడు, సబ్బవరపు సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అనకాపల్లికి చెందిన వైఎస్ఎస్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో విశాఖలోని చంద్రంపాలెం జట్టు, మూడో స్థానంలో పాడేరు జట్టు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

9న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌వీఆర్ మూర్తి తదితరులు

సింహాచలం : విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న అన్ని శాఖల బ్రాహ్మణుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రతినిధి ఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు.పెందుర్తి మండలం సుజాతనగర్ కాలనీలో సంఘం సుమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వివరాలు తెలిపారు. ఎంవీపీకాలనీలోని (ఎంవీపీ సర్కిల్) భద్రం కమిటీ హాల్లో ఈనెల 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వివాహ పరిచయ వేదిక జరుగుతుందన్నారు. బ్రాహ్మణులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 250 మంది వరకు నమోదు చేసుకున్నారన్నారు. 9వ తేదీన కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సూర్య ప్రతాప్, శ్రీనివాసరావు, పిన్నమరాజు సత్యనారాయణ, రమణమూర్తి, ఎం.సత్యనారాయణ మూర్తి, సరోజిని, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు



దుర్గమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ: బొద్దపువానిపాలెం, వెన్నెలపాలెం, జల్లెడపాలెం గ్రామాల్లో కొలువుదీరిన గ్రామ దేవతల పండగ మహోత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ-బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో కొలువుదీరిన శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగ గురువారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వెన్నెలపాలెంలో కొలువైన శ్రీ దుర్గమాంబ పండగను కూడా ప్రజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామ సర్పంచ్ వెన్నెల అప్పారావు దంపతులు, స్థానిక నాయకులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జల్లెడపాలెంలో వెలసిన శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా మరిడిమాంబను ప్రజలు ఆరాధిస్తారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

ముదపాకలో జగనన్న లేఅవుట్ పరిశీలన

సింహాచలం : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. పెందుర్తి మండలం ముదపాకలో జగనన్న లేఅవుట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన గృహ నిర్మాణ పనులు చేయాలని హౌసింగ్ పీడీ శ్రీనివాసరావుని ఆదేశించారు. లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో చైత్ర మాసం పౌర్ణిమ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైభవుడికి ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించారు. సేవా దాతలు, భక్తులు మంగళధ్వనితో వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేశారు. ఉదయం 8.30 గంటలకు భక్తులకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. 10.30 గంటలకు శ్రీవారిని అలంకరించి అర్చన చేశారు. దాతలను శ్రీవారి శాలువా, కండువాతో ఆలయ అర్చకుడు వాసుదేవచార్యులు సత్కరించారు.

హమ్మయ్య.. కాలువలు శుభ్రమయ్యాయి

సాక్షి ఎఫెక్ట్..



పందివానిపాలెంలో కాలువను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం, నరసాపురం గ్రామాల్లో పారిశుధ్యంమెరుగుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. శివారు గ్రామాల్లో అధ్వానంగా ఉన్న పరిస్థితులపై పారిశుధ్యంపై చర్యలేవి శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. వాడచీపురుపల్లి శివారు గ్రామాలైన నర్సాపురం, పందివానిపాలెం గ్రామాల్లో అధ్వానంగా ఉన్న మురుగు కాలువలను సిబ్బంది శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. దోమల బెడద నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించాలని స్థానికులు కోరారు. శివారు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు తక్షణ చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ చెప్పారు.

పారదర్శకంగా ఉపాధి పనులు నిర్వహించాలి

సబ్బవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మరింత పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో గురువారం నిర్వహించిన 2021-22 ఆర్థిక సంవత్సరం మండల స్థాయి సామాజిక తనఖీల ప్రజా వేదిక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ నిబద్ధతతో పనులు చేపడితే నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.10.51 కోట్లతో చేపట్టిన పనులకు తనిఖీలు నిర్వహించారు. వీటిలో 429 పనులకు సంబంధించి రూ.8.09 కోట్ల ఉపాధి కూలీలకు చెల్లింపులతో పాటు మెటీరియల్ కాంపినెంట్‌కు సంబంధించి రూ. 2.4 కోట్ల చెల్లింపులకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. వీటిలో వివిధ గ్రామాల్లో తేడా వచ్చిన రూ.18,950 రికవరీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ ప్రొసీడింగ్ ఆఫీసర్ అడిషనల్ పీడీ ఎం. రోజారాణి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల, అంబుడ్స్‌మెన్ ఎస్. అన్నపూర్ణ, ఎంపీడీవో రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

సింహాచలం : దేశంలోని ప్రజలందరి సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని భారతీయ జనతాపార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం పెందుర్తి బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాని రామునాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో, నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీజేపీ దేశంలో తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకుంటుందని తెలిపారు. బీజేపీ నాయకులు కాళ్ల జగన్‌మోహన్, అచ్చం నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ: బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పరవాడ పార్టీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేసిన నేతలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లా సతీష్, సీనియర్ నాయకులు ముత్యాల అప్పారావు, దాలిబోయిన సంజీవరావు, గండి నమోబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10న విద్యుత్ వినియోగదారుల సదస్సు

మధురవాడ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న మధురవాడలోని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు హాజరయ్యే ఈ సదస్సులో జోన్-3 పరిధిలోని మధురవాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి సబ్ డివిజన్ల పరిధిలోని వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు విన్నవించుకోవచ్చునని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

పరవాడ: నిర్వాసిత గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం ఎల్లప్పుడు కట్టుబడి ఉందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నిర్దేశిత ప్రమాణాలకు లోబడి గాలి, భూగర్భ జలాలు, నీటి నాణ్యతను నిర్వహించడానికి అత్యాధునిక సాంకేతికతను అనుసరిస్తుందని తెలిపింది. సంస్థ ద్వారా ఎగసిపడే ధూళిని నియంత్రించేందుకు యాష్ పాండ్ల వద్ద అత్యాధునిక రెయిన్ గన్‌లు, విండ్ కర్టెన్లు ఏర్పాటు చేసినట్లు యాజమాన్యం తెలిపింది.